పేదల భవిష్యత్తుకు జగనన్న బంగారు బాట



రాజుపాళెం : వెలవలిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



బద్వేలులో లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



పోరుమామిళ్లలో లబ్ధిదారునికి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : పేద ప్రజల బంగారు భవిష్యత్తుకు జగనన్న బాటలు వేశారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని వెలవలి గ్రామంలో మండల వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే రాచమల్లు, ఎంపీపీ సలోమి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, నాయకులు భూమి పూజ చేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చాక పార్టీలకతీతంగా మంచి పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ మైనారిటీల కోసం ఈద్గా, షాదీఖానా నిర్మాణం, గ్రామంలో సిమెంటు రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవేంద్ర కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, సచివాలయ కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, రెండో వైస్ ఎంపీపీ సుబ్బరత్నమ్మ, ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ ఇందిరారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బద్వేలులో..

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని శీలంవారిపల్లె, మహబూబ్‌నగర్ సచివాలయాల ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు వరలక్ష్మి, హసాన్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు కుమార్, షఫి, మౌలాలి, షంషీర్, నరసింహ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఆర్‌ఐ ఖాజాహుస్సేన్, గృహసారధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : మండలంలోని దమ్మన్నపల్లె సచివాలయంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ పాల్గొని అర్హులైన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లక్కినేని ఓబయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, పార్టీ నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, యల్లారెడ్డి, ఎంపీడీఓ, తహసీల్దారు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : మండలంలోని వడ్డమాను గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, ఎంపీడీఓ మైథిలిలు పాల్గని మాట్లాడారు. అనంతరం సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పోలమ్మ, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, స్థానిక సర్పంచ్ ఆల్ఫోనమ్మ, ఎంపీటీసీ గురివిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్‌లో
తక్కువ ధరకే స్థలాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు : జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ద్వారా ప్రభుత్వం తక్కువ ధరకే పేద, మధ్య తరగతి ప్రజలకు స్థలాలను విక్రయిస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ వెంచర్ బ్రోచర్లను శనివారం చైర్మన్ గురుమోహన్‌తో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 44 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వం అనుడా ద్వారా అన్ని అనుమతులు పొందిన వెంచర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో 5 సెంట్లు, 4 సెంట్లు, 3 సెంట్ల విస్తీర్ణంలో మొత్తం 484 ప్లాట్లను అమ్మకానికి పెట్టిందన్నారు. 5 సెంట్ల విలువ రూ.25.25 లక్షలు, 4 సెంట్ల విలువ రూ.21లక్షలు, 3 సెంట్ల విలువ రూ.15.75 లక్షలు నిర్ణయించామన్నారు. నిబంధనల ప్రకారం ఈ వెంచర్‌లో 60 అడుగుల తారు రోడ్డు, మధ్యలో 40 అడుగుల సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సౌకర్యాలతోపాటు అన్ని వసతులు ఉంటాయని వివరించారు. టిడ్కో స్థలంలో ప్రస్తుతం అనుడా లే అవుట్‌ను వేసిందని, వెంచర్ అభివృద్ధి కోసం రూ.29 కోట్లతో టెండర్లు పిలిచారన్నారు. లే అవుట్ వేసిన స్థలంలో సెంటు విలువ రూ.10లక్షల వరకు ఉంది, అన్ని వసతులు ఏర్పాటు చేసి రూ.5లక్షలకే సెంటు స్థలాన్ని అనుడా విక్రయిస్తోందన్నారు. అనుడా చైర్మన్ గురుమోహన్ మాట్లాడుతూ ఆసక్తికలిగిన వారు ఆన్‌లైన్‌లో ప్లాట్లు బుక్ చేసుకోవచ్చునని, అన్ని ప్లాట్లు అమ్మిన తర్వాత లక్కీ డిప్ ద్వారా కొనుగులుదారులకు ప్లాట్ నంబర్ కేటాయిస్తామన్నారు. దరఖాస్తుతో పాటు ప్లాట్ విలువలో 10 శాతం చెల్లించి అగ్రిమెంట్ చేసుకున్న రోజు నుంచి నెల రోజులలోపు 30 శాతం, 6 నెలల్లోపు మరో 30 శాతం, ఏడాదిలోపు పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనుడా వైస్ చైర్మన్ వై.ఓబులేసు నందన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 10 శాతం ప్లాట్లను 20 శాతం రిబెట్‌తో, ప్రభుత్వ పెన్షనర్లకు రిబెట్ లేకుండా 5 శాతం ప్లాట్లను కేటాయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కమిషనర్ వెంకటరమణయ్య, ప్లానింగ్ ఆఫీసర్ శైలజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవండి



చాపాడులో రైతుకు కౌలు కార్డు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాపాడు : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడులో శనివారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి గ్రామాల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ గుర్తిస్తూ వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు తప్పుడు హామీలు ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తోందన్నారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, సర్పంచ్ చింతకుంట మహబూబ్ బీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, వ్యవసాయాధికారి మ్యాగి, పంచాయతీ కార్యదర్శులు ధనుంజయ్, జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



రాజుపాలెంలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండలంలోని రాజుపాలెం, మల్లువారిపల్లె గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, రాజుపాలెంలో విద్యుత్ తీగలు కిందికి ఉండటంతో ప్రమాదం జరుగుతుందని, వెంటనే సరి చేయాలని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకుపోగా సరిచేయాలని ఏఈ బ్రహ్మానందరెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, పోకలమల్లికార్జునరెడ్డి, ఏపీ టూరిజంశాఖ రాష్ట్ర డైరెక్టర్ పోకలరామకృష్ణారెడ్డి, నారాయణయాదవ్, పురుషోత్తంరెడ్డి, చిత్తారాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.విజయభాస్కర్‌రెడ్డి, సింగరయ్య, యువ నాయకుడు ఎ.వెంకటరామిరెడ్డి, పోకలరామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ మహబూబ్‌బీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై న్యాయవిచారణ జరిపించాలి



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణాలపై న్యాయవిచారణ జరిపించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. మణిపూర్ దారుణాన్ని నిరసిస్తూ శనివారం రాత్రి ప్రొద్దుటూరులోని గాంధీ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా విరసం రాష్ట్ర మాజీ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసి తెగల మధ్య బీజేపీ చిచ్చు పెట్టి హింసాకాండ సాగిస్తున్నదని ఆరోపించారు. ఇక్కడ నెలల తరబడి హింస సాగడం వెనుక బీజేపీ రాజకీయ వ్యూహం ఉందన్నారు. సీఎంఎస్ కన్వీనర్ పద్మ మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన తెగల మహిళలు దారుణంగా అత్యాచారాలకు గురవుతున్నారని తెలిపారు. జరిగిన ఘటనపై సుప్రీంకోర్టు జడ్జి చేత విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తవ్వా సురేష్, ఆర్‌వీవీ కన్వీనర్ హమీద్, రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు సూర్యానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనలపై నిరసన

ప్రొద్దుటూరు : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై మాలమహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసల చిన్న ఓబన్న మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అణచివేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర కన్వీనర్ సోమన్న, మాలమహానాడు రాయలసీమ కార్యదర్శి చిన్న, జిల్లా కార్యదర్శి కిరణ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జేవీవీ పట్టణ కార్యదర్శి సునీత పేర్కొన్నారు. శనివారం జేవీవీ ఆధ్వర్యంలో స్కాలర్స్ హైస్కూల్‌లో శాస్త్రీయ ఆలోచన అంటే ఏమిటి అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి దేశం అభివృద్ధి చెందాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందాలన్నారు. ప్రజలు అశాస్త్రీయ అంశాలను నమ్మరాదని, హేతుబద్ధంగా ఆలోచించాలని సూచించారు. విరసం వరలక్ష్మి మాట్లాడుతూ సైన్స్ పెరగడంతోనే మానవాళికి రక్షణ ఉంటుందని తెలిపారు. సైన్స్ నిత్య నూతనంగా మారుతుందని, నిజాలు తెలిసినప్పుడే భయాలు పోతాయని చెప్పారు. న్యాయవాది హరిత మాట్లాడుతూ ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు తవ్వా సురేష్, పాఠశాల హెచ్‌ఎం రాజేంద్ర ప్రసాద్, స్కూల్ ఇన్‌చార్జి రాధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలో శనివారం ఉద్యోగులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీకి ఎంతో మేలు జరిగిందన్నారు. సంస్థలో కార్మికులుగా ఉన్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారన్నారు. కరోనా సమయంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ప్రతి నెల తమకు వేతనాలు చెల్లించారన్నారు. కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయడం, ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా అలవెన్స్‌లు కల్పించడం హర్షనీయమన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు మేలు చేసినందుకుగాను సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డితో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి మ్యాగీ



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ నాగరాజు

చాపాడు : రైతు సాగు చేసే ప్రతి పంటను పక్కాగా నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి మ్యాగి పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓలకు ఈ పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి రైతుతో మాట్లాడి వారు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రమీల, ఏఎస్‌ఓ గురుడాచలం తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పక్కాగా చేయాలి

అట్లూరు : కరీఫ్‌సీజన్‌లో పంటనమోదును పక్కాగా చేయాలని బద్వేలు వ్యవసాయ శాఖ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు తెలిపారు. శనివారం మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల పరిధిలోని చీనీ, పత్తి పంటలకు సంబంధించి 254 మంది రైతులకు రూ.47.5 లక్షలు ఇన్సూరెన్సు వారి ఖాతాలకు జమచేశామన్నారు. ప్రతి పొలం దగ్గరకు వెళ్లి రైతులు సాగు చేసిన పంటను రైతుతో కలసి పంట నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీవాణి, వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, హార్టికల్చర్ అధికారి జయభరత్‌రెడ్డి, విఆర్‌ఓలు, ఆర్బీకే ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయాలి

ప్రొద్దుటూరు : ప్రతి రైతు తప్పనిసరిగా తాను సాగు చేసిన పంటను నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఖరీఫ్ పంట నమోదుపై శనివారం తమ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట నమోదు విషయంలో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పాత యాప్‌కు, కొత్త యాప్‌కు కొన్ని తేడాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ అధికారి చిట్టిబాబు, వీఏఏలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ తదితరులు

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వ విద్యాలయంలో లలిత కళా విభాగం అధిపతి కోట మృత్యుంజయరావు రచించిన ఇండియన్ ఆర్ట్ అండ్ హెరిటేజ్ పుస్తకాన్ని విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మృత్యుంజయరావును ఆయన అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ అధ్యాపక వృత్తితోపాటు విస్తృత పరిశోధన, పుస్తక ప్రచురణల వల్ల విశ్వ విద్యాలయ ఖ్యాతి కూడా విస్తరిస్తుందన్నారు. భారతదేశ కళా సంపద గొప్పదనాన్ని, సాంస్కృతిక సంపదను కళాదృష్టితో రచయిత ఈ పుస్తకంలో సమగ్రంగా చర్చించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య , కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ మన యూనివర్సిటీలో లలిత కళా విభాగం ఇప్పటికే ఎంతో పేరు సంపాదించిందని.. ఈ ప్రచురణ రావడంతో మరింత పేరు వస్తుందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడుతూ మన దేశ చిత్ర, శిల్పవాస్తుల వైశిష్ట్యాన్ని, గొప్పదనాన్ని కళాకారుడిగా వివరించగలిగానన్న తృప్తి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐ క్యూ సీ ఏ సంచాలకులు లోకా సుబ్రమణ్యంశర్మ, హిస్టరి విభాగం ఆచార్యులు కంకణాల గంగయ్య, లలిత కళా విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళకు రక్తదానం చేసిన కానిస్టేబుల్

పోరుమామిళ్ల : పట్టణంలోని ఓ ఆసుపత్రిలో చికిత్సకు చేరిన మహిళ ఆపరేషన్‌కు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ మహేష్ రక్తం ఇచ్చి ఆదుకున్నారు. పెద్దయరసాలకు చెందిన లక్ష్మీదేవి ఆపరేషన్‌కు 'ఓ పాజిటివ్' రక్తం కావాలనడంతో శనివారం బంధువులు రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్‌ను ఆశ్రయించారు. రసూల్ ఆ గ్రూపు రక్తం ఉన్న కానిస్టేబుల్ మహేష్‌తో రక్తం ఇప్పించి మహిళను ఆదుకున్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన

కాశినాయన : మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వీఏఏలకు ఓబుళాపురం సచివాలయంలో శనివారం వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ అధ్యక్షతన ఈ-క్రాప్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ట్రైనీ ఏడీఏ మాధవి, ఏఓ గోవర్ధన్‌లు వీఏఏలకు ఈ-క్రాప్ నమోదును కొత్త యాప్‌లో ఎలా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్ళి రైతులు ఏయే పంటలు సాగు చేశారో గుర్తించి ఈ-క్రాప్ నమోదు చేయాలన్నారు. అనంతరం ఆర్బీకేలోని ఎరువులను పరిశీలించారు. సమావేశంలో వీఏఏలు పాల్గొన్నారు.

25న డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ఆర్టీసీ బస్సులకు సంబంధించి ప్రజల అవసరాలతోపాటు డిపో అభివృద్ధిపై సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 25న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఎవరైనా 99592 25777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధిక శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా వేకువజాము నుండే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామి వారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక రాచమల్లు వారి రాజన్న భోజనశాలలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి 26వ వార్డు కౌన్సిలర్ రాచమల్లు రమాదేవి పేదలకు అన్నం వడ్డించారు. శనివారం కావడంతో ప్రత్యేకంగా పులగం, పచ్చడి, నెయ్యి, పచ్చి పులుసు, మజ్జిగా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు సుమారు 3వేల మందికి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లూరు నాగేంద్రారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, పగిడాల దస్తగిరి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, కమాల్, మహ్మద్ గౌస్, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, బంకా లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పీఆర్‌ఓగా ఈశ్వరయ్య

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీఆర్‌ఓ (ప్రజా సంబంధాల బాధ్యులు)గా అధ్యాపకులు యంబడి ఈశ్వరయ్యను ఎంపిక చేసినట్లు కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ తెలిపారు. 13 సంవత్సరాలుగా కళాశాలకు ఈశ్వరయ్య చేసిన సేవల నిమిత్తం అతన్ని ఎంపిక చేశామన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

రాజుపాళెం : మండలంలోని కూలూరు గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ, ప్రిన్సిపల్‌సెక్రటరీ బండి ఆత్మకూర్ శ్రీధర్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అనంతరం టంగుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను వారు ప్రారంభించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు : రాజుపాళెం జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారాంరెడ్డి తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్‌లో శనివారం వారు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా జేసీ గణేష్ కుమార్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి హాజరవుతారని తెలిపారు.

పోస్టర్లు విడుదల

ప్రొద్దుటూరు : స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఈనెల 26న విజయవాడలో జరిగే ఏపీ వీటీయూఎస్‌సీ రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లను స్ట్రగుల్ కమిటీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ పొన్న శివయ్య, సర్కిల్ అధ్యక్షుడు ఇడెం లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, యూఈఈయూ డివిజన్ అధ్యక్షుడు లెనిన్ బాబు, ఆదినారాయణ, యూఈసీ డబ్ల్యూసీ నాయకులు నాగరత్నాచారి, ఓబులేసు, మధు తదితరులు పాల్గొన్నారు.

యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్న అధ్యాపకురాలు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శివజ్యోతి

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో పారాసైటాలజి హెచ్‌ఓడీగా పనిచేస్తున్న డాక్టర్ సిరిగిరెడ్డి శివజ్యోతి యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నారు. తిరుపతిలోని పశువైద్యవిశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన సభలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ చేతుల మీదుగా ఆమె యంగ్ సైంటిస్ అవార్డు అందుకున్నారు. పశువులలో కుందేటి వ్యాధి గురించి పరిశోధనలు చేసిన ఈమె పీహెచ్‌డీ పట్టా పొందారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి ఆఫ్ యోగివేమన యూనివర్సిటీలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్, స్టెప్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగరాజు అధ్యక్షత వహించగా ఇండస్ట్రియల్ ప్రామోషన్ ఆఫీసర్ నూర్ అహ్మద్ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 30 నుంచి 40 శాతం రాయితీ ఇచ్చి విద్యార్థులు పారిశ్రామిక రంగంలో ఎదగడానికి ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ఎస్‌ఈబీ ఎస్‌ఐ నజీర్ బేగ్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. స్టెప్ ఆఫీస్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు హరినాథరెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కడప రాయుని మాసోత్సవం



విశేష అలంకారంలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి మాసోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో అర్చకులు మయూరం కృష్ణమోహన్ బృందం తొలుత మూలమూర్తికి విశేష పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను కనుల పండువగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని గోవింద నామస్మరణల మధ్య దేవునికడప మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు తమ ఇళ్ల వద్దకే తరలివచ్చిన దేవతామూర్తులను దర్శించుకుని పూజా సామాగ్రిని అందజేసి మొక్కుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బి.కోడూరు : అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మండల అభివృద్ధి అధికారి రమణ తెలిపారు. శనివారం మండలంలోని తుమ్మలపల్లె సచివాలయం పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 164 మందికివివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శేషారెడ్డి, తహసీల్దారు విద్యాసాగర్, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్య, పశువైద్యాధికారి లక్ష్మీనరసయ్య, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. వయస్సు 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన వారికి బెంగుళూరులో 35 రోజులపాటు భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.